సాక్షి
రంగారెడ్డి
సోమవారం, 11, డిసెంబర్, 2023



## సభ్యత్వానికి ఆహ్వానం

వాటాధనం చెల్లించి.. గుర్తింపు కార్డు పొందాలని పీఏసీఎస్ అధికారులు రైతులను ఆహ్వానిస్తున్నారు. 8లో▸



## హైనా దాడి

హైనా దాడిలో లేగదూడలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో▸



## నిధుల కోసం పోరాడుతాం

ప్రతిపక్షమైనా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తెచ్చేందుకు పోరాడుతామని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. 8లో▸

## న్యూస్‌రీల్

### నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని కలెక్టర్ భారతి హోళికేరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శాసన సభ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా వాయిదా పడిన కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### బీమా పెంపు అభినందనీయం

జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి



రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమాను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆదివారం స్థానిక అధికారులు, వైద్యులు, ప్రజా ప్రతినిధులతో కలిసి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో ఒకటైన రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షల బీమాను ప్రభుత్వం ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఇప్పటి వరకు ఈ పథకం కింద రూ.5 లక్షల బీమా అందుతోందని, కొత్త ప్రభుత్వం దానిని రూ.10 లక్షలకు పెంచిందన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా వైద్యం చేసుకునేందుకు ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బడంగ్‌పేట్ మేయర్, టీపీసీసీ కార్యదర్శి చిగురింత పారిజాత, కందుకూరు ఆర్డీఓ సూరజ్ కుమార్, తహసీల్దార్ మహమూద్ అలీ, మహేశ్వరం ఇన్‌చార్జి ఎంపీపీ సునితా నాయక్, కందుకూరు ఎంపీపీ మంద జ్యోతి, ఎంపీడీఓ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలి



సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలని జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత సంఘటన కార్యదర్శి భాస్కర యోగి అన్నారు. మన సంస్కృతి సంప్రదాయలను గౌరవించటంలో భాగంగా ప్రజలు అనేక రూపాల్లో తమ భక్తిభావాన్ని వ్యక్త పరుస్తుంటారని తెలిపారు. మండలకేంద్రంలోని డీఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం సామాజిక సమరసత ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరయోగి మాట్లాడుతూ.. పంచ భూతాలకు కులం, మతం, బీద, ధనిక వ్యత్యాసం లేదన్నారు. గాలి, నీరు భూమి, ఆకాశం, అగ్ని అందరినీ ఒకేలా చూస్తాయని చెప్పారు. ప్రజలందరినీ ఒకే దగ్గరికి చేర్చే ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విభాగ్ ప్రచారక్ దేవేందర్ రాజు, కార్యవాహ కేరెళ్లి అంతరెడ్డి, సామాజిక సమరసత కన్వీనర్ దామోదర్‌రెడ్డి, స్వయం సేవకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

### ఆ జీవోను రద్దు చేసి న్యాయం చేయండి



వీఎంహోం మైదానంలో ప్రదర్శన చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థులు

హుడాకాంప్లెక్స్: జీవో 48పై కాంగ్రెస్ ప్రభుత్వం పునరాలోచన చేసి తమకు న్యాయం చేయాలని కానిస్టేబుల్ అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. కొత్తపేటలోని వీఎంహోం మైదానంలో ఆదివారం గతంలో కాంగ్రెస్ నాయకులను కలిసిన ఫొటోలను చూపిస్తూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 48 జీవోతో జరిగిన అన్యాయాన్ని వివరిస్తూ ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తమకు అన్యాయం జరిగిందనే కాంగ్రెస్ పక్షాన నిలిచామని చెప్పారు. ఎంపిక సమయంలో తమకు అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు.

# ఉన్నట్టా.. లేనట్టా?

జంట జలాశయాల పరిరక్షణ కోసం అమల్లోకి తెచ్చిన జీఓ 111పై సందిగ్ధత నెలకొంది. గత ప్రభుత్వం ఈ జీఓను తొలగిస్తున్నట్లు రెండుసార్లు ప్రకటించింది. దీని స్థానంలో మరో జీఓను సైతం తెచ్చింది. కానీ సాంకేతికంగా జీఓ ఇంకా అమల్లోనే ఉన్నట్లు అప్పటి ప్రభుత్వం ఉన్నత న్యాయస్థానంలో స్పష్టం చేసింది. మరోవైపు ఈ జీఓ తొలగింపు నేపథ్యంలో దాని పరిధిలో ఉన్న పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఈ క్రమంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం జీఓ 111పై ఎలా ముందుకు వెళ్లనుందనే అంశం ఆసక్తికరంగా మారింది.

– సాక్షి, సిటీబ్యూరో

**111 జీఓను ఎత్తివేసినట్లు ప్రకటించిన గత ప్రభుత్వం**

- అధికారికంగా మాత్రం రద్దు కాలేదన్నది స్పష్టం
- ఇప్పటికే పలుచోట్ల భారీగా అక్రమ నిర్మాణాలు
- పది రోజుల్లో 70కి పైగా అనుమతులిచ్చిన హెచ్‌ఎండీఏ
- కొత్త ప్రభుత్వం నిర్ణయంపైనే అందరి చూపులు



ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌ల పరీవాహక ప్రాంతాలను కాపాడేందుకు 1996లో ప్రభుత్వం 111 జీఓను అమల్లోకి తెచ్చిన సంగతి తెలిసిందే. హెచ్‌ఎండీఏ పరిధిలోని 82 గ్రామాలు ఈ జీఓ పరిధిలో ఉన్నాయి. సుమారు 1.30 లక్షల ఎకరాల భూమి విస్తరించింది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఏదో ఒక స్థాయిలో ఈ జీఓ చర్చనీయాంశమవుతూనే ఉంటుంది. మరోవైపు దీనిని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ పర్యావరణ సంస్థలు, సామాజిక కార్యకర్తలు న్యాయస్థానాల్లో పోరాడుతున్నారు. జీఓకు విఘాతం కలిగించే చర్యలపై కేసులు నడుస్తున్నాయి.

- ఈ క్రమంలోనే గత ప్రభుత్వం మరోసారి ఈ జీఓను కదిలించింది. 82 గ్రామాలకు చెందిన రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎత్తేయనున్నట్లు పేర్కొంది. జలాశయాల పరిరక్షణ కోసం జీఓ 69 తెచ్చారు. వీటి పరీవాహక ప్రాంతాన్ని 10 కిలో మీటర్లకు తగ్గించడంతో పాటు మురుగునీరు చేరకుండా పటిష్టమైన చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. 82 గ్రామాల పరిధిలో వివిధ జోన్‌ల కింద భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కానీ.. అధికారికంగా జీఓ 111 రద్దు కాకపోవడంతో కొంత కాలంగా సందిగ్ధం కొనసాగుతోంది. ఈ క్రమంలోనే ఎన్నికలు వచ్చాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్థానంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది.

**అడ్డగోలుగా అనుమతులు..**

మరోవైపు 111 జీఓను ఎత్తివేసినట్లు గత ప్రభుత్వం ప్రకటించడంతో హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగం పలు గ్రామాల్లో అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇచ్చింది. పర్యావరణ పరిరక్షణపై ఎలాంటి ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోకుండానే వట్టినాగులపల్లి వంటి కొన్ని గ్రామాల్లో కేవలం 10 రోజుల్లో 70కి పైగా అనుమతులను ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. భవన నిర్మాణాలకు పర్యావరణ సంస్థ అయిన ఈపీటీఆర్ఐ నుంచి ఆమోదం లభించిన తర్వాతే అనుమతులను ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. కానీ అలాంటి ఆమోదం లేకుండానే అప్పటి ఒక కీలకమంత్రి, హెచ్‌ఎండీఏలో కీలకమైన ఉన్నతాధికారి ఒత్తిడితో అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.

**ప్రణాళికా విభాగం ప్రక్షాళన..**

మరోవైపు కొత్తగా అధికారం చేపట్టిన ప్రభుత్వం హెచ్‌ఎండీఏపై సీరియస్‌గా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. లేఅవుట్‌లు, భవన నిర్మాణాలు, పరిశ్రమల అనుమతులు, మహానగర అభివృద్ధి వంటివి హెచ్‌ఎండీఏ పరిధిలో ఉండడంతో దీన్ని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రణాళికా విభాగంలో మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే ఇద్దరు ప్రణాళికా అభివృద్ధి అధికారుల్లో ఒకరి పరిధిని రెండు జోన్‌లకు తగ్గించారు. నాలుగు జోన్‌లలో ఒకరికి మూడు కేటాయించి, ఒక అధికారిని ఒక జోన్‌కే పరిమితం చేశారు. దీంతో హెచ్‌ఎండీఏలో ఇంకా ఎలాంటి మార్పులు రానున్నాయనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# వణికిస్తోంది

- రోజురోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- పెరుగుతున్న చలి తీవ్రత
- కప్పేస్తున్న పొగమంచు
- ఉదయాన్నే బయటికి వెళ్లేందుకు జంకుతున్న జనం

పది రోజులుగా నమోదైన కనిష్ట ఉష్ణోగ్రత వివరాలు

| తేదీ | ఉష్ణోగ్రత |
|---|---|
| 1 | 15.3 |
| 2 | 14.0 |
| 3 | 16.2 |
| 4 | 17.1 |
| 5 | 19.4 |
| 6 | 19.4 |
| 7 | 18.3 |
| 8 | 13.1 |
| 9 | 13.5 |
| 10 | 12.8 |



చలి మంట కాచుకుంటున్న ప్రజలు

చేవెళ్ల: ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి. జిల్లాలో చలి తీవ్రత అంతకంతకూ పెరిగిపోతోంది. ఉదయం 8 గంటల వరకు రోడ్లపై జనం, వాహనాలు కనిపించడం లేదు. పొగమంచుతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. వారం రోజులుగా చలిగాలులు వీస్తుండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. చలి బారి నుంచి తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. చలి మంటలు వేయడం, స్వెటర్లు, మఫ్లర్లు ధరించడం చేస్తున్నారు. సాయంత్రం ఐదు గంటల నుంచే చలి మొదలవుతుండటంతో త్వరగా ఇళ్లకు చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వ్యాపారస్తులు సైతం త్వరగా దుకాణాలు మూసివేసి ఇళ్లకు చేరుకుంటున్నారు. పని ఉంటే తప్ప బయటికి రావటం లేదు. వాహనదారులు ఉదయం, సాయంత్రం సమయాల్లో వచ్చే పొగమంచుతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయన్నే పనుల్లోకి వచ్చే పారిశుద్ధ్య కార్మికులు, పాల వ్యాపారులు, మార్నింగ్ వాక్ చేసేవారు కాస్త ఆలస్యంగా బయటకు వస్తున్నారు. ఇటీవల తుపాను ప్రభావంతో చలి తీవ్రత పెరిగిందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు చలికాలంలో ప్రజలకు కావాల్సిన స్వెటర్లు, వెచ్చగా ఉండే దుప్పట్లు అమ్మే దుకాణాలు వెలుస్తున్నాయి.

**జాగ్రత్త అంటున్న వైద్యనిపుణులు**

ఇప్పటికే జలుబు, దగ్గు ఉక్కిరిబిక్కిరి చేస్తుండగా ఇప్పుడు చలి తోడవడంతో ఆస్పత్రులకు బాధితుల సంఖ్య పెరిగింది. చలికాలంలో ఎక్కువగా చర్మవ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. చలి నుంచి వీలైనంతవరకు దూరంగా ఉండాలంటున్నారు. చలికాలంలో దద్దుర్లు, చర్మం పగుళ్లు వస్తాయని ఎక్కువగా నీరు తీసుకోవాలని.. ఆస్తమా ఉన్నవారు చలిగాలులకు మరింత దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. వేకువజామునే బయటికి వెళ్లాల్సి వస్తే తప్పనిసరి చర్మాన్ని పూర్తిగా కప్పుకొనేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సరైన పౌష్టికాహారం తీసుకోవాలని చెబుతున్నారు.

# మంచిని స్వాగతిస్తాం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: ప్రభుత్వం పేద ప్రజలకోసం మంచి చేస్తే స్వాగతిస్తామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.10లక్షల ఆరోగ్యశ్రీ పథకాలను మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఆదివారం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు బస్సుల్లో ప్రయాణం చేసేందుకు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా సహకరించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించిన పథకాలు ప్రజలకు ఎలా చేరువయ్యాయో అలాగే ఈ పథకాలను ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రొటోకాల్ విషయంలో రసాభాస**

కార్యక్రమానికి సంబంధించి ప్రొటోకాల్ వివాదం చెలరేగింది. ప్రజాప్రతినిధులకు ఆహ్వానం లేదని ఎందుకు చెప్పలేదని రాష్ట్ర పంచాయతీచాంబర్ అధ్యక్షుడు సత్యనారాయరెడ్డి అధికారులను ప్రశ్నించారు. వాట్సాప్ మెసేజ్ చేశామని తహసీల్దార్ చెప్పారు. ఫోన్‌లో చూడని వారి పరిస్థితి ఏమిటని నిలదీయగా మరోసారి ఇలా జరగకుండా చూస్తామని ఆర్డీఓ సాయిరాం సర్దిచెప్పారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు జోక్యం చేసుకున్నారు. తమ ప్రభుత్వం వచ్చిన రెండు రోజుల్లోనే ఇచ్చిన మాట ప్రకారం రెండు పథకాలను అమలు చేస్తోందని అన్నారు. గత ప్రభుత్వాలు ఏమీ చేయలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే అనేక పథకాలు ప్రజలకు చేరాయని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఈ క్రమంలో ఇరు పార్టీ వర్గీయుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులు, పోలీసులు వెంటనే అప్రమత్తమై వారిని సముదాయించారు. అనంతరం మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వారితో కలిసి బస్సెక్కి టికెట్ తీసుకున్నారు. కార్యక్రమం అనంతరం ఎవరికి వారుగా వెళ్లిపోవడంతో పరిస్థితి సద్దుమణిగింది.



మహిళలతో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

# కట్టుకున్నవాడే కడతేర్చాడు

- భార్యపై అనుమానం పెంచుకున్న భర్త
- తరచూ గొడవ.. కత్తితో పొడిచి హత్య
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు

ఇబ్రహీంపట్నం రూరల్: కట్టుకున్న వాడే కాలయముడయ్యాడు. మూడు ముళ్ల బంధంతో ఏడు అడుగులు వేసినవాడే బంధం తెంచుకున్నాడు. అనుమానం పెనుభూతమై కత్తితో పొడిచి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీఐ రఘువీర్‌రెడ్డి కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా నెరడుగొమ్ము మండలం మోసగడ్డ తండాకు చెందిన బానోతు జ్యోతి (33), జబ్బర్‌లాల్ దంపతులు. ఇద్దరు పిల్లలతో కలిసి కొన్నేళ్ల క్రితం తుర్కయంజాల్ మున్సిపల్ పరిధిలోని సూరజ్‌నగర్ కాలనీకి వలసవచ్చారు. జబ్బర్‌లాల్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తుండగా, జ్యోతి ఇళ్లలో పని చేసి జీవనం సాగించేవారు. భార్యపై అనుమానం పెంచుకున్న జబ్బర్‌లాల్ వివాహేతర సంబంధం ఉందని తరచూ గొడవపడేవాడు. తాజాగా శనివారం అర్ధరాత్రి రాత్రి ఇద్దరి మధ్య వాగ్వాదం మొదలైంది. కోపంతో జబ్బర్‌లాల్ భార్య జ్యోతి కడుపులో కత్తితో పొడిచాడు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆమెను స్థానికులు గమనించి 108లో నగరంలోని వనస్థలిపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మరణించినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పిల్లలు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. పిల్లల రోదన చూసి అక్కడున్నవారు కన్నీరు పెట్టారు. మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం స్వగ్రామానికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టిన పోలీసులు జబ్బర్‌లాల్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.



జ్యోతి మృతదేహం

# అధైర్య పడొద్దు.. అండగా ఉంటా



సమావేశంలో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల్లో ఓటమి చెందామని కార్యకర్తలు అధైర్య పడొద్దని.. అండగా ఉంటానని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం ఆదిబట్ల మున్సిపల్ పరిధి బొంగ్లూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు కొప్పు జంగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మంచిరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎంతో కష్టపడి పని చేసిన కార్యకర్తలకు ఎప్పటికీ రుణపడి ఉంటానని అన్నారు. దశాబ్ద కాలంగా నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. కానీ ఎన్నికల ఫలితాలు ఆశించినట్లుగా రాలేదన్నారు. గెలుపు, ఓటములు సహజమేనని, ఓడిపోయామని ఎవరూ బాధపడొద్దని సూచించారు. ప్రజల కోసం ప్రజల పక్షాన నిరంతరం నిలబడదామని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్ మాట్లాడుతూ.. భవిష్యత్తులో తిరిగి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. త్వరలో స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికలు జరుగుతాయని క్యాడర్ సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, యాచారం జెడ్పీటీసీ జంగమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్దుకుపోదాం రండి

కాంగ్రెస్‌ను వీడిన నేతలకు అధిష్టానం పిలుపు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర వ్యాప్తంగా వీచిన కాంగ్రెస్ గాలిలో సైతం నగరంలో పరాజయాన్ని మూటకట్టుకోవాల్సి రావడంతో అధిష్టానం అంతర్మథనంలో పడింది. గ్రేటర్ పరిధిలోని అర్బన్ అసెంబ్లీ స్థానాలన్నింటిలో ఓటమి పాలు కావడాన్ని జీర్ణించుకోలేక పోతోంది. సాక్షాత్తూ రాష్ట్ర రాజకీయాలకు గుండె కాయలాంటి హైదరాబాద్ గడ్డ పరిస్థితి నెలకొనడాన్ని త్రీవంగా పరిగణించింది. ఎన్నికల ఫలితాలు, అందుకు కారణాలను విశ్లేషించి.. కనీసం జీహెచ్‌ఎంసీ ఎన్నికల వరకైనా సంస్థాగతంగా బలోపడేందుకు పార్టీ వీడిన పాత పార్టీ శ్రేణులను తిరిగి ఘర్ వాపసీకి చర్యలకు ఉపక్రమంచింది. అందులో భాగంగా టికెట్ ఆశించిన భంగపడి పార్టీ వీడిన వారితో సంప్రదింపులు చేస్తోంది. పార్టీలో అన్యాయం జరిగిన మాట వాస్తవమే.. కష్టాల్లో ఉన్నప్పుడు జెండా మోసి.. అధికారంలోకి వచ్చే ముందు పార్టీ వీడటం దురదృష్టకరం. జరిగింది జరిగిపోయింది. సర్దుకుపోదాం రండి అంటూ విజ్ఞప్తి చేస్తోంది.

**కీలక నేతలపై నజర్..**

గత ఎన్నికలకు ముందు పలు అసెంబ్లీ సెగ్మెంట్లలో టికెట్ ఆశించిన కీలక నేతలు పార్టీని వీడారు. నగరంతో పాటు శివార్ల సెగ్మెంట్లలో సైతం ఇదే పరిస్థితి కొనసాగింది. కొందరు.. బీఆర్‌ఎస్, మరికొందరు బీజేపీలో చేరారు. ఉప్పల్, మల్కాజిగిరి, ఎల్బీనగర్, మహేశ్వరం, ముషీరాబాద్, జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి, ఉప్పల్, అంబర్‌పేట, కుత్బుల్లాపూర్ తదితర అసెంబ్లీ సెగ్మెంటక్లు చెందిన ముఖ్య నేతలు పార్టీ వీడారు. వారి వెంట కేడర్ సైతం నడిచింది. అంతకు ముందు సైతం ముఖ్యమైన మరి కొందరు నేతలు పార్టీ వీడారు. తిరిగి వారిని పార్టీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. దీంతో కొందరు నేతలను నుంచి సానుకూలత వ్యక్తమైంది.

**టార్గెట్ జీహెచ్‌ఎంసీ ఎన్నికలు**

లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్ ఘర్ వాపసీకి సిద్ధమైంది. మరో ఏడాదిన్నరలో బల్దియా ఎన్నికలు జరగనుండటంతో సంస్థాగతంగా బలపడేందుకు ప్రయత్నాలు చేస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానంతరం గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ సింగిల్ డిజిట్‌కు పరిమితమైంది. తిరిగి అలాంటి పరిస్థితి ఎదురవకుండా ముందస్తు చర్యలకు ఉప్రకమిస్తున్నట్లు సమాచారం.

# ఫార్మాసిటీని రద్దు చేస్తాం

- గ్యారంటీలను అమలు చేస్తాం
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: ఫార్మాసిటీని రద్దు చేస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నంలో ఆదివారం రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఉచిత బస్సు ప్రయాణ పథకాలను ఆయన ప్రారంభించారు. బస్సులో మంచాల వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఫార్మాసిటీతో ఆ చుట్టుపక్కల ప్రాంతాలేకాదు సుమారు 200 కిలోమీటర్ల మేర గాలి, నీరు కలుషితం అవుతాయని అన్నారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణను అప్పులకుప్పగా కేసీఆర్ ప్రభుత్వం మార్చిందని విమర్శించారు. ప్రజల ప్రభుత్వం వచ్చిందని, ప్రైవేట్ ప్రభుత్వం పోయిందన్నారు. ఆరు గ్యారంటీలను అమలు పరుస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో కొత్తగా ఒక్క రేషన్‌కార్డు, పింఛన్లు ఇవ్వలేదని మండిపడ్డారు. రెక్కాడితేగాని డొక్కాడని పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. రాజీవ్ ఆరోగ్యశ్రీని అద్భుత పథకంగా అభివర్ణించారు. కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ అన్వర్, జెడ్పీటీసీ భూపతి గాళ్ల మహిపాల్, మున్సిపల్ చైర్ పర్సన్లు కప్పరి స్రవంతి, ఆర్తిక, ఆర్టీసీ డీఎం వెంకటనర్సప్ప తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో కలిసి బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

# రాజీవ్ ఆరోగ్యశ్రీ ఘనత వైఎస్సార్‌దే..

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ రూరల్: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే లక్ష్యంతో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆదివారం డాక్టర్ వెకటేశ్వర రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన రెండు రోజుల్లోనే రెండు పథకాలను అమలు చేశారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదల గుండెల్లో చెరగని ముద్ర వేశారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు వెంకట్‌రాంరెడ్డి, తాండ్ర విశాల, బంగారు స్వరూప, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్యయాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, టీపీసీసీ సభ్యుడు బార్‌అలీఖాన్, పట్టణ అధ్యక్షుడు కొళ్ల చెన్నయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# హైనా దాడి

- మృత్యువాత పడుతున్న లేగదూడలు
- ఆందోళన చెందుతున్న రైతులు


లేగదూడ కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

**షాద్‌నగర్ రూరల్:** హైనా దాడిలో లేగదూడలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ శివారులో ఆదివారం తెల్లవారు జామున హైనా దాడిలో మరో లేగదూడ హతమైంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామస్తులు పొలాల వద్ద పశువుల పాకల ఏర్పాటు చేసుకున్నారు. కొన్ని రోజులుగా గుర్తు తెలియని జంతువు దాడిలో లేగదూడలు చనిపోతున్నాయి. దీంతో గ్రామానికి చెందిన రైతులు చిన్న కొమురయ్య, పెద్ద నర్సింహ, ఈర్లపల్లి అంజయ్య, పోచయ్య, దాసరి కృష్ణయ్య పశువుల పాకవద్ద నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారుజామున ఎంపీటీసీ మాజీ సభ్యురాలు స్వప్న పొలంవద్ద చిరుత లేగదూడపై దాడి చేస్తున్న సమయంలో కుక్కలు అరవడంతో రైతులు అప్రమత్తమయ్యారు. వారు గమనించగా చిరుత కుక్కలపైకి గాండ్రిస్తూ వెళ్లిపోయింది. చిరుతను చూసిన రైతులు, గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి చిరుతను పట్టుకోవాలని కోరుతున్నారు. పట్టణ సమీపంలోని వ్యవసాయ పొలాలవద్ద చిరుత సంచరిస్తుందనే వార్త వాట్సాప్‌లలో రావడంతో పట్టణ వాసులు భయాందోళనకు గురయ్యారు.

## చిరుత కాదు హైనా

లేగదూడలపై చిరుత దాడి చేసిన విషయాన్ని తెలుసుకున్న అటవీశాఖ అధికారులు, పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. లేగదూడలను, గుర్తు తెలియని జంతువు తిరిగిన ఆనవాళ్లను ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవీందర్‌గౌడ్, బీట్ ఆఫీసర్ అజీజ్ పరిశీలించారు. జంతువు పాద ముద్రలను పరిశీలించిన అధికారులు హైనాగా నిర్ధారించారు. చిరుత గొంతుపై దాడి చేస్తుందని.. హైనా మాత్రమే వెనుక కాళ్ల భాగంలో దాడి చేస్తుందని చెప్పారు. లేగదూడలు హైనాల బారిన పడకుండా రైతులు పాకవద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చిరుత సంచారమనేది అవాస్తవమని.. రైతులు ఆందోళనకు గురికావొద్దని అటవీశాఖ అధికారులు, పోలీసులు సూచించారు.

# సభ్యత్వానికి ఆహ్వానం

రైతులకు వ్యవసాయంలో సహకారం అందించేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు పనిచేస్తాయి. వారికి ఆర్థిక సహకారం అందిస్తూ చేయూతనిస్తున్నాయి. సంఘం డైరెక్టర్లను ఓటు హక్కుతో ఎన్నుకోవాలనే నిబంధన ఉంది. సరైన అవగాహన లేక రైతులు తమ హక్కును కోల్పోతున్నారు.

**పీఏసీఎస్‌లతో రైతుల అభ్యున్నతి**
- రూ.300 వాటాధనం చెల్లింపుతో అన్నదాతలకు ఓటుహక్కు
- సభ్యులుగా చేరాలని కోరుతున్న అధికారులు
- అవగాహన లేక డైరెక్టర్ల ఎన్నికకు దూరం


యాచారం పీఏసీఎస్ కార్యాలయం

**యాచారం:** వాటాధనం చెల్లించి.. గుర్తింపు కార్డు( ఓటు హక్కు) పొందాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) అధికారులు రైతులను ఆహ్వానిస్తున్నారు. పీఏసీఎస్‌లో సభ్యులుగా ఉండే డైరెక్టర్ల ఎన్నిక కోసం ఓటు హక్కు అవకాశం ఉంటుంది. పీఏసీఎస్‌లో ఉండే ఓటు హక్కు ద్వారా తమకు అనుకూలమైన డైరెక్టర్‌ను ఎన్నుకుని వ్యవసాయ రంగంలో నెలకొన్న సమస్యలను తీర్చుకోవచ్చు. పంట కాలంలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, యంత్రాల కొనుగోళ్ల విషయంలో ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు పడే అవకాశం ఉంటుంది. రైతులకు అవగాహన లేక పీఏసీఎస్‌లో గుర్తింపు కార్డు పొందలేక పోతున్నారు. తద్వారా తమకు నచ్చిన డైరెక్టర్‌ను ఎన్నుకోక రైతులు నష్టపోతున్నారు. యాచారం పీఏసీఎస్‌లో 24 గ్రామ పంచాయతీలకు గాను 13 మంది డైరెక్టర్లు ఉన్నారు. మొత్తం సభ్యులు(గుర్తింపు కార్డు పొందినవారు) 7,920 మంది ఉన్నారు. 7,920 మంది సభ్యులు పీఏసీఎస్‌లో వివిధ రకాల రుణాలు తీసుకునే సమయంలో రూ.300 వాటాధనం చెల్లించి సభ్యత్వాలు తీసుకున్నారు. సభ్యులుగా గుర్తింపు కార్డు పొందిన రైతులు ప్రతీ ఐదేళ్లకోసారి డైరెక్టర్ల ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు.

**అవగాహన కల్పించినా స్పందన కరువు**

మండల పరిధిలోని 24 పంచాయతీల్లో వ్యవసాయ భూములుండి, పట్టాదారు, పాసుపుస్తకాలున్న రైతులు 22 వేల మందికి పైగానే ఉన్నారు. యాచారం పీఏసీఎస్‌లో మాత్రం 7,920 మంది రైతులు మాత్రమే సభ్యులుగా ఉన్నారు. పీఏసీఎస్ అధికారులు రుణాల వసూళ్లల్లో గ్రామాల పర్యటనలో రైతులను కలిసి సభ్యులుగా చేరాలని రూ.300 వాటాధనం చెల్లించి గుర్తింపు కార్డులు పొందాలని అవగాహన కల్పించినా రైతుల్లో స్పందన ఉండడం లేదు. కొంత మంది రైతులు దీర్ఘకాలిక, స్వల్పకాలిక, వ్యవసాయ పంట రుణాలు పొందినా గుర్తింపు కార్డులు పొందలేకపోతున్నారు. నందివనపర్తి, యాచారం, మొండిగౌరెల్లి, చింతపట్ల, చింతుల్ల, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, నల్లవెల్లి, మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి తదితర గ్రామాల్లో గుర్తింపు కార్డులు లేని వేలాది మంది రైతులు ఉన్నారు.

**మూడు నెలల్లోనే సభ్యత్వం..**


పీఏసీఎస్ గుర్తింపు కార్డు

పీఏసీఎస్‌లో రూ.300 వాటాధనం చెల్లించిన రైతులకు మూడు నెలల్లోనే సభ్యత్వం ఇచ్చి గుర్తింపు కార్డులు జారీ చేస్తారు. ఐడీ కార్డులు పొందిన ప్రతీ రైతుకు పీఏసీఎస్ ఎన్నికల్లో డైరెక్టర్లను ఎన్నుకోవడం కోసం ఓటు హక్కు ఉంటుంది. గ్రామాల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల మాదిరిగానే పీఏసీఎస్ డైరెక్టర్ల ఎన్నికలకు సైతం డిమాండ్ ఉంటుంది. పీఏసీఎస్‌లో రుణాలు పొందని రైతులు నేరుగా అక్కడ ఉండే సీఈఓను కలిసి కొత్త పట్టాదారు, పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఎస్‌ఓబీ జిరాక్స్‌లతో పాటు 5 పాసు ఫోటోలు ఇచ్చి రూ.300 వాటాధనం చెల్లిస్తే గుర్తింపు కార్డులు ఇస్తారు. ఇలా వాటాధనం చెల్లించిన రైతులకు ప్రతి మూడు నెలలకోమారు జరిగే పీఏసీఎస్ సర్వసభ్యసమావేశాల్లో తీర్మానించి అర్జీలు పెట్టుకున్న రైతులకు గుర్తింపు కార్డుల జారీకి అనుమతిస్తారు. కేవలం 150 మంది రైతులు మాత్రమే ప్రస్తుతం గుర్తింపు కార్డుల జారీకి అర్జీలు పెట్టుకున్నారు.

**మూడు నెలలకు ఒకసారి..**



పీఏసీఎస్‌లో రుణాలు పొందని రైతులు సైతం సభ్యులుగా చేరవచ్చు. రూ.300 వాటాధనం చెల్లించి, ఆధార్‌కార్డు, పట్టాదారు, పాసుపుస్తకం, ఎస్‌ఓబీ జిరాక్స్ పత్రాలు ఇస్తే గుర్తింపు కార్డులు జారీ చేస్తాం. ప్రతీ మూడు నెలలకు ఒకసారి జరిగే పీఏసీఎస్ సర్వసభ్య సమావేశంలో తీర్మానించి అర్జీలు పెట్టుకున్న రైతులకు ఓటు హక్కు పొందే గుర్తింపు కార్డులు అందజేస్తాం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– నాగరాజు, సీఈఓ, పీఏసీఎస్ యాచారం

**రైతులు సభ్యత్వం పొందాలి**



మండలంలోని 24 పంచాయతీల్లో వ్యవసాయ భూమి ఉండి పట్టాదారు, పాసుపుస్తకాలున్న రైతులంతా పీఏసీఎస్‌లో సభ్యులుగా చేరాలి. డైరెక్టర్ల ఎన్నికల్లో తమకు సేవ చేసే డైరెక్టర్‌ను ఓటు హక్కుతో ఎన్నుకునే అవకాశం ఉంటుంది. భవిష్యత్‌లో సహకార సంస్థల్లోనూ రైతులకు వ్యవసాయ రంగంలో ఉపయోగించే యంత్రాలు గాని, ఎరువులు, విత్తనాలు రాయితీపై పొందే అవకాశం ఉంటుంది. రైతులకు మంచి గుర్తింపు ఉంటుంది.

– కొప్పు సుకన్య, ఎంపీపీ, యాచారం

# భూమి లేని పేదలకు ఐదెకరాలు ఇవ్వాలి

వ్యవసాయ వృత్తిదారుల రాష్ట్ర అధ్యక్షుడు ప్రభుదాస్


భూమి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న యూనియన్ సభ్యులు

**కొందుర్గు:** భూమిలేని నిరుపేదలకు ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభుదాసు డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం కొందుర్గు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రభుదాసు మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు మారినా పేదల బతుకులు మారడం లేదన్నారు. ఆహార భద్రత, సుస్థిర జీవనోపాధి వనరులపై హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసు, భువనేశ్వరి, ఇస్తారయ్య, జంగమ్మ, పార్వతమ్మ, రాజు, నర్సింలు, భారతమ్మ, సువర్ణ పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

The general public is hereby informed that my client Mr. Mohd Samiuddin, S/o Late Mohd Ameeruddin, R/o CSK Colony, Phase V, RR District, is intending purchase all that part of Plot No. 38 and 39, admn. 152.50 sq. yards (i.e. 50.50 sq. yards part of plot No. 38 and 102.00 sq. yards, part of plot No.39), and another piece of Plot No. 39 and plot No. 40, admn. 306 sq. yards, (i.e.101 sq. yards part of plot No. 39 out of 203 sq. yards and 205.00 sq. yards of plot No. 40), from Mr. Yaqoob Bin Javeed Ansari and Sri Abdullah Bin Ali Al Hadad, respectively, both being registered agreement of sale cum G.P.A. holders of Mr. G. Ashwin Kumar, both plots situated under Sy. No. 6/A, situated at Veera nagar, Jalpally Village, Saroor Nagar Revenue Mandal, RR District, under Jalpally Grampanchayat. If any person has any objection as against this transaction, he/she may contact the undersigned with all relevant papers, within 5 days from the date of this publication.

Sd/- MOHD OSMAN SHAHEED
Mohammad Adnan
B.A. LL.M., ADVOCATES
8-13-67/I, Opp: N.P.A, shivrampally Road, R.C.H.S. Colony, Hyd-52

# నిధుల కోసం పోరాడుతాం


ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన బీఆర్ఎస్ శ్రేణులు

మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి

**మహేశ్వరం:** ప్రతిపక్షమైనా నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తెచ్చేందుకు పోరాడుతామని మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. ఆదివారం ఆమెను మండల పరిధిలోని గొల్లూరు గ్రామానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు గ్రామ సమస్యలను వివరించారు. ఇందుకు స్పందించిన సబితారెడ్డి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ లీగల్ సెల్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌చారి, పార్టీ గొల్లూరు గ్రామ అధ్యక్షుడు ఆనంద్, పార్టీ సీనియర్ నాయకులు దర్శన్, మాదయ్య, హరిశంకర్, భిక్షపతి, పోషయ్య, నర్సింహ, శ్రీశైలం, విజయ్, శివ కుమార్, వినయ్, సుజన్ కుమార్, శ్రీకాంత్, సత్తయ్య, యాదయ్య, మురళీకృష్ణ గౌడ్, చిన్న యాదయ్య, సంజీవ కుమార్, యాదయ్య, పాల్యా టోప్యా నాయక్, మహేశ్ గౌడ్ పాల్గొన్నారు.

# పాల ట్యాంకర్ ఢీ: యువతి మృతి


ప్రత్యూష(ఫైల్)

**ఇబ్రహీంపట్నం:** ప్రభుత్వ పాల వాహనం (ట్యాంకర్) ఢీకొని ఓ యువతి మృతి చెందింది. ఈ ఘటన ఇబ్రహీపట్నం పీఎస్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన ప్రకారం ఖానాపూర్ గ్రామానికి చెందిన పి.ప్రత్యూష(19) ప్రైవేటు ఉద్యోగిని. ఆమె విధులు పూర్తి చేసుకుని స్వగ్రామానికి వెళ్తుంది. ఈ క్రమంలో బస్ దిగి రోడ్డు దాటుతుండగా.. ఇబ్రహీంపట్నం వైపు వేగంగా వెళ్తున్న పాల ట్యాంకర్ ఢీకొట్టింది. వాహనం టైర్లు యువతి నడుము మీదుగా వెళ్లాయి. ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. యువతి తండ్రి ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడు. కేసు దర్యాప్తులో ఉంది.

# గుర్తు తెలియని వృద్ధుడి బలవన్మరణం


మృతదేహం

**షాద్‌నగర్‌రూరల్:** గుర్తు తెలియని వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ సయ్యద్‌అక్బర్ ప్రకారం.. గుర్తు తెలియని వృద్ధుడు(65) రైల్వే స్టేషన్‌లోని పుట్ ఓవర్ బ్రిడ్జికి తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని తెలుసుకున్న స్టేషన్‌మాస్టర్ ఉదయ్‌కుమార్ రైల్వే ఎస్ఐ సయ్యద్‌అక్బర్‌కు సమాచారం అందించారు. ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వివరాలు తెలియకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి శరీరంపై తెల్ల చొక్కా, తెల్ల ధోతి, నలుపు రంగు నిక్కర్ ధరించి ఉన్నాడు. మృతుడి వివరాలు తెలిసినా.. ఆచూకీ లభించినా వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. స్టేషన్ మాస్టర్ ఉదయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు రైల్వే ఎస్ఐ సయ్యద్‌అక్బర్ తెలిపారు.

# కార్తీక దీపోత్సవ వేడుకలు


వేడుకల్లో ఎస్ఐ బల్‌రాం, బ్రహ్మకుమారీస్

**ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలోని బ్రహ్మకుమారీస్ రాజయోగ కేంద్రంలో ఆదివారం కార్తీక దీపోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజయోగ కేంద్రంలో శివుడి వద్ద ఎస్ఐ బల్‌రాం ఆధ్వర్యంలో దీపాలు వెలిగించారు. అనంతరం బ్రహ్మకుమారీస్ రాజయోగ కేంద్రం నిర్వాహకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు భక్తిభావంతో మెలగాలని సూచించారు. మనలోని ఆత్మదీపాన్ని వెలిగించుకుని మనలో ఉన్న అజ్ఞాన చీకటిని, చెడు గుణాలను తొలగించుకోవాలని సూచించారు. సుఖశాంతులతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం పలువురికి పండ్లు పంపిణీ చేశారు.

# ప్రజా ప్రభుత్వంతో సమస్యల పరిష్కారం

రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్‌అలీ


సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆసీఫ్‌అలీ

**కడ్తాల్:** రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డిని రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్‌అలీ మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని సీఎం నివాసంలో రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆసీఫ్‌అలీ మాట్లాడుతూ.. జెడ్పీటీసీ సభ్యుడిగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, పీసీసీ అధ్యక్షుడిగా ప్రతిపక్షంలో ఉంటూ నిరంతరం ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాడిన వ్యక్తికే రాష్ట్ర ప్రజలు పట్టంకట్టారన్నారు. పార్టీ నాయకులతో కలుపుగోలుగా ఉంటూ కాంగ్రెస్‌ను అధికారంలోని తీసుకువచ్చిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. ప్రజాప్రభుత్వంతో రాష్ట్ర ప్రజల సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


ఎమ్మెల్యే ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, స్వాములు

**నందిగామ:** సమాజంలోని ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో నందిగామకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జిలెల్ల రాంరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చెప్పారు. అంతకు ముందు అంతిరెడ్డిగూడలోని హనుమాన్, ఎల్లమ్మ ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జంగ నర్సింహయాదవ్, ఎంపీటీసీ సభ్యులు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, సుదర్శన్ గౌడ్, వేణుగోపాల్ గౌడ్, సత్తయ్య, ప్రభాకర్, నిరంజన్‌గౌడ్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

**అభినందనల వెల్లువ**

**కొత్తూరు:** నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన వీర్లపల్లి శంకర్ ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన్ను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మద్దతు ప్రకటించి తన గెలుపునకు సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అంతేకాకుండా నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలు, నాయకుల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు సుదర్శన్‌గౌడ్, వేణుగోపాల్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, నర్సింహ, రమేశ్, సత్తయ్య, ప్రభాకర్, సురేశ్‌గౌడ్, కొమ్ముకృష్ణ, చంద్రపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ అభివృద్ధికి కృషి

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

**షాబాద్:** నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సంకెపల్లిగూడ సర్పంచ్ కుమ్మరి దర్శన్, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో కేసీఆర్ టికెట్ ఇచ్చారని.. ఊపిరున్నంత వరకు ఆయన వెంటే నడుస్తానన్నారు. ఎన్నికల్లో తనపై అభిమానంతో ఓటేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు ఎన్నికలు సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏవైతే సంక్షేమ పథకాలు తెలంగాణ ప్రజలకు అమలు చేసిందో వాటిని తూచా తప్పకుండా కొనసాగిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు తదితరులున్నారు.

**కార్యకర్తలకు అండగా 'కారు'**

**మొయినాబాద్:** బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఐదు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన బీఆర్ఎస్ సభ్యత్వం తీసుకున్నారు. ఆయనకు మంజూరైన రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఆదివారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి, మైనార్టీ నాయకుడు మహబూబ్, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ రవూఫ్, నాయకులు పరమేశ్, సూరియాదవ్, ప్రవీణ్, ప్రమోద్, రవి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కాలె యాదయ్యను సన్మానిస్తున్న సర్పంచ్ దర్శన్ తదితరులు